బాబు వచ్చె.. జాబు పోయె



- నిరుద్యోగులను మోసం చేసిన కూటమి ప్రభుత్వం
- వలంటీర్ వ్యవస్థకు మంగళం
- చిరుద్యోగులపై ఉక్కుపాదం
- బలవంతంగా ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, ఎండీయూ ఆపరేటర్ల తొలగింపు
- చంద్రబాబు తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఓడీచెరువు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగులపై వేధింపులు అధికమయ్యాయి. బాబు వస్తే జాబ్ గ్యారంటీ.. లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన చంద్రబాబు.. నిరుద్యోగులను నిండా ముంచేశారు. అధికారం చేపట్టి సంవత్సరం దాటినా కొత్త ఉద్యోగాలు కల్పించిన దాఖలాలు లేవు. అయితే మండలంలో చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తున్న వారిని తొలగించి, పొట్ట కొట్టారు. కొండ నాలుక కోసం మందు వేస్తే ఉన్న నాలుక ఊడింది అన్న చందంగా తయారైంది పరిస్థితి. బాబు వస్తే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాడు.. పరిశ్రమలు తెచ్చేస్తాడు అని స్థానిక నాయకులు సైతం ఊరూరా, గడప గడపకూ తిరిగి మరీ ప్రచారం చేశారు. అధికారంలోకి అడుగుపెట్టిన వెంటనే బాబు కుట్ర బుద్ధి బట్టబయలైంది. మోసం చేయడం తన నైజం.. నమ్మి మోసపోవడం మీ తప్పు అన్నట్లుగా ఉద్యోగుల పని పట్టాడు. ఒక్కొక్కటిగా ఉద్యోగాలను ఊడగొట్టే పనిలో పట్టాడు. దేశ వ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందిన వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చారు. తీరా గెలిచాక వలంటీర్ వ్యవస్థకు చట్టబద్ధత లేదంటూ వలంటీర్లను తొలగించారు. వలంటీర్ వ్యవస్థను రద్దు చేసి రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది కుటుంబాలను రోడ్డున పడేశారు. జీతం రూ.ఐదు వేల నుంచి రూ.పది వేలకు పెంచుతామని నమ్మబలికి నిండా ముంచేశారు. కూటమికి ఓటు వేసి మోసపోయాం అంటూ వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే క్రమంలో ఉపాధి హామీ పథకంలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లను బలవంతంగా తప్పించారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిని మీకు చేతనైంది చేసుకోపోండి అంటూ స్థానిక నాయకులు బలవంతంగా బయటకు గెంటివేశారు. వేలాది మంది జీవనోపాధి కోల్పోయి బ్రతుకుతెరువు లేక అల్లాడిపోతున్నారు.

ఇంటింటికీ రేషన్ రద్దు..

వయస్సు పైబడి రేషన్ షాపుకు వెళ్లలేని వారు, వికలాంగులకు ఎంతో ఉపయుక్తంగా ఉన్న ఇంటి వద్దకే రేషన్ పంపిణీని రద్దు చేశారు. ఇంటింటికీ వెళ్లి బియ్యం, పప్పు, చక్కెర తదితర వస్తువులను సరఫరా చేసే ఎండీయూ వాహనాలను రద్దు చేసి డ్రైవర్లు, ఆపరేటర్లకు జీవనోపాధి లేకుండా చేశారు. స్వయం సహాయక సంఘాల పద్దులు రాసే ఆనిమేటర్లను సైతం వదల లేదు. గత ప్రభుత్వంలో పని చేసిన ఆనిమేటర్లను కూటమి ప్రభుత్వం తొలగించింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మద్యం దుకాణాల్లో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక.. ప్రభుత్వ మద్యం దుకాణాల స్థానంలో ప్రైవేట్ వ్యక్తులకు మద్యం విక్రయాలకు వీలు కల్పించడంతో ఉద్యోగులు బజారున పడ్డారు. కూటమి ప్రభుత్వంలో తొలి సంతకం మెగా డీఎస్సీ అన్నారు. సంవత్సర కాలం పూర్తయినా తొలి సంతకానికే దిక్కులేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం గడిచిపోయినా కొత్త ఉద్యోగాల సంగతి దేవుడెరుగు.. ఉన్న ఉద్యోగాలు ఊడగొట్టక పోతే చాలు అని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



ఓడీచెరువు మండల వ్యాప్తంగా ఊడిన ఉద్యోగాలు

ఉద్యోగం పేరు	సంఖ్య
వలంటీర్లు	272
ఫీల్డ్ అసిస్టెంట్లు	22
ఎండీయూ ఆపరేటర్లు	20
మద్యం దుకాణాల ఉద్యోగులు	5
ఆనిమేటర్లు	40

మోసపోయాం



నేను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్‌గా పని చేశాను. ఉన్న ఊర్లో గౌరవప్రదమైన ఉద్యోగం. ఎంతో గౌరవం ఉండేది. ప్రతి ఒక్కరూ ఎంతో ఆప్యాయంగా పలకరించేవారు. వలంటీర్‌కు అంత ప్రాముఖ్యత ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.10 వేలు జీతం ఇస్తారని నమ్మి మోసపోయాం. అయితే కూటమి ప్రభుత్వం గెలిచాక వలంటీర్ వ్యవస్థను రద్దు చేసింది. మా జీవితాలతో చెలగాటం ఆడుకుంటోంది. ఈ పాపం ఊరికే పోదు.

– హరికృష్ణ, వలంటీర్, పెద్దగుట్లపల్లి

ఈఎంఐ ఎలా చెల్లించాలి?



గత జగనన్న ప్రభుత్వంలో ఎండీయూ ఆపరేటర్‌గా నియమించారు. ఈ వాహనంపై ఆధారపడి జీవిస్తున్నాం. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎండీయూ వ్యవస్థను రద్దు చేశారు. రావాల్సిన జీతం రాకపోగా ఎండీయూ వాహనానికి ఈఎంఐ చెల్లించమంటే ఎలా చెల్లించేది? ఇది మోసపూరిత ప్రభుత్వం. జీవనానికే దిక్కులేక అల్లాడి పోతున్నాం. ఈ పాపానికి ఈ ప్రభుత్వం మూల్యం చెల్లించుకుంటుంది.

– హరినాథ రెడ్డి, ఎండీయూ ఆపరేటర్, సున్నంపల్లి

చంద్రబాబు మోసకారి



గత ప్రభుత్వం మద్యం దుకాణాల్లో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది. జీవనం సాఫీగా నడిచేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉన్న ఉద్యోగులను పీకేశారు. ఇదేనా? ఈ ప్రభుత్వం కల్పించే ఉద్యోగ భద్రత. మాకు బ్రతుకు తెరువు చూపాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వానిదే. బాబు వస్తే జాబు గ్యారెంటీ అన్నారు. కానీ బాబు గెలిచాక ఉన్న ఉద్యోగం పోయింది.

– చల్లా మహేష్, మద్యం దుకాణ ఉద్యోగి

ఉద్యోగం ఊడగొట్టారు..



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక నాయకులు నీవు రేపటి నుంచి విధుల్లోకి రావద్దని హుకుం జారీ చేశారు. ఏం తప్పు చేయకుండా ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగం నుంచి తొలగిస్తారని అధికారులను అడిగితే సమాధానం చెప్పలేదు. చివరకు వారి వేధింపులు తాళలేక ఆఫీసుకు వెళ్లడం మానుకున్నాను. ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చి.. ఉన్న ఉద్యోగం ఊడగొట్టారు. కూటమి ప్రభుత్వానికి మా శాపం తప్పకుండా తగులుతుంది.

– భాగ్యమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్

నేడు 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమం

గాండ్లపెంట: మండల కేంద్రంలోని స్టార్‌కేఫ్ వద్ద ఆదివారం సాయంత్రం 4 గంటలకు బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కదిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్, పార్టీ నియోజవర్గ నాయకులు హాజరవుతారన్నారు. మండల పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, మాజీ సర్పంచులు, డైరెక్టర్లు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తలుపులలో..

తలుపుల: స్థానిక సెవెన్ హిల్స్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 11 గంటలకు 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ పయాజ్ అహమ్మద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్, హిందూపురం పరిశీలకుడు రమేష్‌రెడ్డి హాజరవుతారన్నారు. మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నల్లచెరువులో..

నల్లచెరువు: కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని అగ్రికల్చర్ ఆఫీస్ వద్ద జరగనున్న సమావేశానికి కదిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్, నియోజకవర్గ నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మహాసభలు విజయవంతం చేయండి

నల్లమాడ: శ్రీసత్యసాయి జిల్లా సీపీఐ 2వ మహాసభలు ఈనెల 31, ఆగస్టు 1న ధర్మవరం పట్టణంలో జరగనున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి వల్లిపి వెంకటరమణ తెలిపారు. మహాసభలకు సీపీఐ కార్యకర్తలు, నాయకులు, రైతులు, కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శనివారం నల్లమాడలో విడుదల చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల సంయుక్త కార్యదర్శి నాగేంద్ర, నాయకులు గంగాద్రి, ఆదిలక్ష్మి, కేశవ, రామాంజి, రాజు, సురేష్, వెంకటేష్, రమణ తదతరులు పాల్గొన్నారు.

ఓడీ చెరువు: భారత కమ్యూనిస్టు పార్టీ శ్రీసత్యసాయి జిల్లా 2వ మహాసభలను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహాసభలకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. సీపీఐ మండల కార్యదర్శి చలపతి నాయుడు, మహిళా సంఘం నాయకురాలు రత్నాబాయి మాట్లాడారు. ధర్మవరం పట్టణంలో జూలై 31, ఆగస్టు 1న జరిగే జిల్లా మహాసభలకు మండల వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, కార్మిక, కర్షక నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శులు సుధాకర్, రవికుమార్, నాయకులు రామచంద్ర, వెంకటేష్, దేవేంద్ర, రేణుక, తిరుపాలు, అనసూయమ్మ, వీరప్ప, ఈరప్ప పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం



వ్రతం ఆచరిస్తున్న మహిళలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శ్రీనివాస నగర్‌లో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏడు శనివారాల వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి మూలవిరాట్‌ను అర్చకుడు రాజేష్ వివిధ రకాల పూలు, తులసీ ఆకులు, పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు ఏడు శనివారాల వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చెన్నంశెట్టి జగదీష్, జింకా రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



అలంకరణలో వేంకటేశ్వరుడు

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం

ధర్మవరం: వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపికైన చందమూరి నారాయణరెడ్డి శనివారం మాజీ ఎమ్మెల్యేను కలిశారు. 37వ వార్డు ప్రజలు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి గజమాలతో సత్కరించారు. పార్టీలో రాష్ట్రస్థాయి పదవిని ఇచ్చి ప్రోత్సహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామన్నారు. కేతిరెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులే పార్టీకి మూల స్తంభాలని.. కష్టపడిన ప్రతి ఒక్కరికీ వైఎస్సార్‌సీపీలో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రజాసేవే పరమావధిగా అందరూ కష్టపడి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బాలిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మాసపల్లి సాయికుమార్, కడపల రంగస్వామి, బాలంగోపాల్, కత్తె పెద్దన్న, నాయకులు రాజగోపాల్‌రెడ్డి, బొమ్మాహరి, మద్దిలేటి మల్లికార్జున, జింకా కంబగిరి, చెన్నాప్రసాద్, లోకేష్, రాజారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుబ్బిరెడ్డి, శివారెడ్డి, తవిశల నాగభూషణరెడ్డి, రామాంజి, మిద్దె మల్లికార్జున, రామలింగగౌడ్, చిన్ననారాయణరెడ్డి, మూర్తి, మల్లికార్జునరెడ్డి, బాల నర్సింహులు, నున్నభాస్కర్, మోహన్‌రెడ్డి, కడపల ఈశ్వర్, ఆకుల రామలింగ, బొమ్మన్న తదితరులు పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఇటీవల ఎంపికైన వేముల అమర్‌నాథ్‌రెడ్డి, అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు, విద్యార్థులతో కలసి కేతిరెడ్డిని సత్కరించారు. విద్యార్థి విభాగంలో రాష్ట్ర అధికార ప్రతినిధిగా చోటు కల్పించడంపై మాజీ సీఎం వైఎస్ జగన్, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం రాయల్, కామిరెడ్డిపల్లి శ్రీకాంత్, హిందూపురం సుధ, శివ, ప్రభ, బాబ్‌జాన్, దుర్గ, చంటి, వెంకి, మణి తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందమూరి నారాయణరెడ్డి

సన్మానం..

తాడిమర్రి: ఇటీవల వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియామకమైన ముదిగుబ్బ మండలం, రామస్వామి నాయక్ తాండాకు చెందిన దుంగావత్ లక్ష్మానాయక్ శనివారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిని కలసి సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి నిరంతరం శ్రమించాలని సూచించారు.



పీర్లకు చదివింపులు చేస్తున్న దృశ్యం



అగ్ని గుండాన్ని వెలిగించిన భక్తులు

ఘనంగా పెద్ద సరిగెత్తు

కనగానపల్లి: మామిళ్లపల్లి గ్రామంలో శనివారం మొహర్రం ఉత్సవాల్లో భాగంగా పెద్ద సరిగెత్తు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం గ్రామంలోని మహిళలు, పిల్లలు పానకాలు ఎత్తుకొని ఊరేగింపుగా చావిడి దగ్గరకు వెళ్లి పీర్లస్వాములకు చక్కెర చదివింపులు చేయించారు. ఈ సందర్భంగా పీర్లస్వాములను పూలు, వెండి ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. చావిడి ముందు అగ్ని గుండంలో చెట్లు వేసి వెలిగించారు. ఇక ఆదివారం చివరి రోజు జలధి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు.

వృథాగా నీటి తొట్టె



కుణుతూరు వద్ద నీటి తొట్టెలో చెత్తా చెదారం వేసిన దృశ్యం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో పశువుల దాహార్తిని తీర్చడానికి నిర్మించిన నీటి తొట్టెలు వృథాగా దర్శనమిస్తున్నాయి. ధర్మవరం మండల వ్యాప్తంగా 83 తొట్టెలను నిర్మించగా.. ఒక్కో తొట్టె నిర్మాణానికి రూ.30 వేల వరకు ఖర్చు చేశారు. అయితే నీటి తొట్టెల్లోకి నీటిని వదలడం లేదని రైతులు మండిపడుతున్నారు. మండల వ్యాప్తంగా నాయకులే కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి బిల్లుల కోసం నాసిరకంగా తొట్టె పనులు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇలా నీటి తొట్టెలు వృథాగా దర్శినమిస్తున్నాయి.

– ధర్మవరం రూరల్:

క్లుప్తంగా

జానపద కళాకారిణికి సన్మానం



సోమిశెట్టి సరళను సత్కరిస్తున్న పద్మశాలి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణానికి చెందిన జానపద కళాకారిణి సోమిశెట్టి సరళను శనివారం గుంటూరులో ఘనంగా సన్మానించారు. గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో పద్మశాలి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవం సందర్భంగా పద్మశాలి కులస్తుల్లో అవార్డులు సాధించిన జానపద కళాకారిణి సరళను నిర్వాహకులు సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం కన్వీనర్ నాగేశ్వరరావు, శివరామకృష్ణ, ఐటీశాఖ అడిషనల్ కమిషనర్ కోటేశ్వరి, రాయలసీమ యూనివర్శిటీ కర్నూలు వైస్ చాన్సలర్ వెంకట బసవరావు, ఆంధ్రప్రదేశ్ సచివాలయం ఆర్థికశాఖ డిప్యూటీ కార్యదర్శి రామతీర్థ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



శ్రీనివాసులు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కన్వీనర్ అశోక్ రెడ్డి

తనకల్లు: మండల పరిధిలోని గందోడివారిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆరుద్ర శ్రీనివాసులు (65) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి, తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆరుద్ర శ్రీనివాసులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆరుద్ర శ్రీనివాసులు మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. కార్యక్రమంలో తవళం సర్పంచ్ శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు కొండకమర్ల ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కట్టెతో దాడి

తనకల్లు: మండల పరిధిలోని టి.సదుం వద్ద ఇస్మాయిల్ అనే వ్యక్తి భాస్కర్‌పై కత్తితో దాడి చేశాడు. ఎస్ఐ గోపి తెలిపిన వివరాలు.. సున్నంపల్లి వాండ్లపల్లికి చెందిన భాస్కర్ తన స్నేహితులతో కలిసి ఈనెల 11వ తేదీన టి.సదుం గ్రామంలో జరుగుతున్న మొహర్రంకు వచ్చాడు. అయితే భాస్కర్ మూత్ర విసర్జన కోసం వెళ్లేటప్పుడు నల్లచెరువు మండలం దేవిరింటిపల్లికి చెందిన ఇస్మాయిల్ భుజానికి రాసుకుంటూ వెళ్లాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కోపంతో ఊగిపోయిన ఇస్మాయిల్ పక్కనే ఉన్న కట్టెతో దాడి చేయడంతో భాస్కర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు తీవ్రంగా గాయపడిన భాస్కర్‌ను చికిత్స కోసం బెంగుళూరుకు తరలించారు. భాస్కర్ తండ్రి పూజారి వెంకట చలపతి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి రూరల్ మండల పరిధిలోని ఏపీఐఐసీ పార్క్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం పెడపల్లి, వానవోలు, గోరంట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ నాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



ప్రభుత్వ భూమిలో జెండాలు నాటుతున్న దృశ్యం

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని అమీన్ నగర్, న్యూ అమీన్ నగర్‌లో ఉన్న నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సైదాపురం పొలం సర్వే నంబర్ 294లోని ప్రభుత్వ భూమిలో సీపీఎం ఆధ్వర్యంలో జెండాలు నాటారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాలు కేటాయించాలని 5 నెలలుగా సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయం, జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టడం జరిగిందన్నారు. ఇంటి స్థలం కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే రెవెన్యూ అధికారులు విచారణ కుడా చేయలేదన్నారు. ఇంటి అద్దె చెల్లించకలేక ఇబ్బందులు పడుతున్న పేదలకు సర్వే నంబర్ 294లోని ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతలో 3 సెంట్లు ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జీఎల్ నరసింహులు, సాంబశివ, బాబ్జాన్, రామ్మోహన్, నారాయణ, ముస్తాక్, రఫీ, ఉదయ్, అంజినమ్మ, గంగాదేవి, రబియా తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ ప్రాక్టీస్ సెషన్స్ ప్రారంభం

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఫుట్‌బాల్ క్లబ్ ప్రాక్టీస్ సెషన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎస్‌పీడీసీఎల్ పుట్టపర్తి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శివరాములు మాట్లాడుతూ.. క్రీడల్లో సత్తా చాటితే మంచి భవిష్యత్తు ఉందన్నారు. యువ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు విజయ్‌కుమార్, కోచ్ ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

జనరేటర్‌లో మంటలు

కొత్తచెరువు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలో ఉన్న ప్రణయ్ పవర్ సిస్టమ్స్‌లో జనరేటర్ డోర్‌కు వెల్డింగ్ పనులు చేయిస్తుండగా ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. స్థానికులు భయాందోళనతో పరుగులు పెట్టారు. అటువైపుగా వెళ్తున్న కొత్తచెరువు సీఐ స్పందించారు. సిబ్బంది, స్థానికుల సహాయంతో మంటలను అదుపు చేశారు.

15న కలెక్టరేట్ వద్ద ధర్నా

కదిరి టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన పుట్టపర్తి కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నట్లు సంఘం అధ్యక్షుడు శివారెడ్డి, కార్యదర్శి ఆత్మారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కదిరి నియోజకవర్గ పరిధిలోని పెన్షనర్లు అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్‌లను తక్షణమే విడుదల చేయాలని కోరారు. 11వ పీఆర్‌సీలో నష్టపోయిన క్వాంటం ఆఫ్ పెన్షన్ పునరుద్ధరణ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ధర్మవరంరూరల్: మండల పరిధిలోని పోతుకుంట సచివాలయం వద్ద శనివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. దేవలం హరి ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేసి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో 156 మంది రోగులకు ధర్మవరం గండికోట హాస్పిటల్ డాక్టర్ బి.రాజశేఖర్‌రెడ్డి వైద్య చికిత్సలు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని పరిశీలించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఫైరోజా బేగం పేదలకు వైద్య సేవలను అందిస్తుండటంతో అభినందించారు.

కేబుల్ చోరీ

కదిరి అర్బన్: మండల పరిధిలోని వీరేపల్లిపేట గ్రామంలో శుక్రవారం రాత్రి వ్యవసాయ పొలాల్లోని కేబుల్‌ను గుర్తు తెలియని దుండగులు చోరీ చేసినట్లు రైతులు గంగిరెడ్డి, రామాంజనేయులు తెలిపారు. చోరీపై కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.